క్లుప్తంగా

ఎంపీ పరామర్శ

కూసుమంచి: కూసుమంచి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బండారుపల్లి కాంతయ్యను శనివారం రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని కుటుంబసభ్యులతో కాసేపు మాట్లాడారు. మాజీ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బానోత్ పీర్యానాయక్, షేక్ మీరా పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు మేకల మల్లమ్మ(101) శనివారం అనారోగ్యంతో మృతిచెందారు. ఈమేరకు మండల తహసీల్దార్ పీవీ రామకృష్ణ, మాజీ సర్పంచ్ అంగడి వీరస్వామి, పలు పార్టీల నాయకులు మల్లమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఖమ్మంవ్యవసాయం/కామేపల్లి: నగరంలోని ఇల్లెందు క్రాస్ రోడ్ సబ్ స్టేషన్ కవిరాజ్‌నగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్లకు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఆదివారం ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-3 సెక్షన్ ఏఈఈ జి.వెంకన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో కవిరాజ్‌నగర్ రోడ్ నంబర్ 6 నుంచి 16వ వరకు, న్యూ విజన్ స్కూలు ప్రాంతం, కోర్టు ఏరియాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. అలాగే నగరంలోని ధంసలాపురం, ప్రకాష్‌నగర్, ఖానాపురం సబ్ స్టేషన్లలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు దృష్ట్యా ఆదివారం ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఉంటుందని టౌన్-2 ఏడీఈ ఎం.యాదగిరి తెలిపారు. అంతేకాకకామేపల్లి మండలం ముచ్చర్ల సబ్‌స్టేషన్ పరిధిలోని మద్దులపల్లి, లాల్యతండా, కెప్టెన్ బంజర ఫీడర్ పరిధిలో గల గ్రామాలకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ ఉండదని ఏఈ శ్రీనివాసులు తెలిపారు.

25న 'ఆట కావాలా-పాట కావాలా' షో

ఖమ్మంగాంధీచౌక్: చిరంజీవి నటించిన సినిమాల్లోని పాటలు, నృత్యాలతో 'ఆట కావాలా- పాట కావాలా' పేరిట ఈనెల 25న మెగా షో నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ జిల్లా లక్ష్మీనారాయణ, రచయిత కొత్తపల్లి శేషు తెలిపారు. ఈ సందర్భంగా ఖమ్మంలో వారు శనివారం కార్యక్రమ బ్రోచర్లను విడుదల చేసి మాట్లాడారు. భక్త రామదాసు కళాక్షేత్రంలో ఈనెల 25న సాయంత్రం ఆరు గంటలకు కార్యక్రమం మొదలవుతుందని అనేక రికార్డులు సాధించిన వారితో నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. మొగిలి గుణకర్ తదితరులు పాల్గొన్నారు.

పతంగుల పంపిణీ

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని గాంధీచౌక్, 36వ డివిజన్ పరిధిలోని విద్యార్థులకు సంక్రాంతి సంస్కృతి, సంప్రదాయాలను అందించడంలో భాగంగా వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం పతంగులు, మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ కొత్త వెంకటేశ్వరరావు, క్యాబినేట్ డిస్ట్రిక్ట్ ట్రెజరర్ గుంటుపల్లి దివాకర్ గుప్తా, వాసవీ క్లబ్ ఖమ్మం అధ్యక్షుడు పసుమర్తి రామ్మోహన్‌రావు, కార్యదర్శి వెచ్చ కృష్ణమోహన్, కోశాధికారి పసుమర్తి శ్రీనివాసరావు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలపై గ్రామసభ

కామేపల్లి: మండలంలోని ముచ్చర్ల జీపీ పరిధిలో నిర్మించిన 20 డబుల్ బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు అందించేందుకు గానూ ఇటీవల స్వీకరించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించారు. ఈమేరకు అర్హుల జాబితాపై శనివారం జీపీ కార్యాలయంలో తహసీల్దార్ సుధాకర్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ అభిప్రాయాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మళ్లీ దరఖాస్తులను పూర్తి స్థాయిలో పారదర్శకంగా పరిశీలించిన తర్వాత తుది జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబయాదవ్, ట్రెయినీ ఎస్సై రోహిత్, ఆర్ఐ విజయ, గ్రామ ప్రత్యేకాధికారి రమేశ్, కార్యదర్శి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	16	బచ్చలికూర	3
వంకాయ	38		20
బెండకాయ	44	పాలకూర	3
పచ్చిమిర్చి	36		20
కాకర	38	చుక్కకూర	3
బోడ కాకర	120		20
బీర	34	తోటకూర	3
దొండ	54		20
పొట్లకాయ	38	గోంగూర	4
చిక్కుడు	58		20
గోరుచిక్కుడు	38	మెంతికూర	2
క్యాబేజీ	24		20
క్యాలీఫ్లవర్	30	కొత్తిమీర	1
ఆలుగడ్డ	34		40
చామగడ్డ	46	పుదీన	1
క్యారెట్	54		25
క్యాప్సికం	64	-ఖమ్మం వ్యవసాయం	

పచ్చందాలు పంచేందుకు..

డంపింగ్‌యార్డ్‌లో చెత్తపోయి మొక్కలొచ్చే..

- ఆహ్లాదాన్ని అందించేలా అధికారుల కసరత్తు
- 8 ఎకరాల్లో 10వేల మొక్కలు నాటేందుకు ప్రణాళికలు
- చెత్త నిల్వ లేకుండా పటిష్ట చర్యలు
- కొనసాగుతున్న బయోమైనింగ్



దానవాయిగూడెం డంపింగ్‌యార్డ్‌లో నాటిన మొక్కలు



నీరు పెట్టేందుకు ఏర్పాటు చేసిన ట్యాప్

దశాబ్దాలుగా వ్యర్థాల గుట్టలతో పేరుకు పోయిన డంపింగ్‌యార్డ్‌లో పచ్చదనం సంతరించుకుంటుంది. యార్డ్‌లో వ్యర్థాలను బయోమైనింగ్ చేయడం ద్వారా ఖాళీ అయిన స్థలాన్ని కేఎంసీ అధికారులు స్వాధీనం చేసుకుని, ఆ స్థలం అన్యాక్రాంతం కాకుండా స్థానికులకు ఆహ్లాదాన్ని అందించేలా.. కాలుష్యం తగ్గించేలా మొక్కలు నాటారు. మొత్తం 30 ఎకరాలు కల్గిన యార్డు స్థలంలో 8 ఎకరాల శుభ్రం కాగా ఆ స్థలంలో మొక్కలు నాటేందుకు వీలుగా శుభ్రం చేశారు. వేల సంఖ్యలో మొక్కలు నాటి స్థలాన్ని పచ్చదనంతో నింపుతున్నారు. స్థానిక ప్రజలకు డంపింగ్‌యార్డ్ వలన ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు, పాలకులు చర్యలు చేపట్టారు.

– ఖమ్మంమయూరి సెంటర్

చకచకా బయోమైనింగ్..

డంపింగ్‌యార్డులో వేలాది మెట్రిక్ టన్నుల వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయి 30 ఎకరాల స్థలాన్ని ఆక్రమించాయి. ఈనేపథ్యాన వ్యర్థాలను తొలగించి స్థలాన్ని ఖాళీ చేసేందుకు కేఎంసీ అధికారులు బయోమైనింగ్‌ను ప్రవేశపెట్టి గత రెండున్నరేళ్లుగా బయోమైనింగ్ చేస్తున్నారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి వ్యర్థాలను రీసైక్లింగ్ చేస్తున్నారు. దీంతో 10 ఎకరాల స్థలం ఖాళీ అవగా.. శుభ్రం చేసి ఉపయోగంలోకి తీసుకొచ్చారు. ఇక మరో 20 ఎకరాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించడానికి బయోమైనింగ్ కొనసాగిస్తున్నారు.

దుర్వాసనకు స్వస్తి..

గత కొన్నేళ్లుగా నగరంలోని దానవాయిగూడెం డంపింగ్‌యార్డులో చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోంది. దీంతో చుట్టుపక్కల ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈనేపథ్యాన పలుమార్లు ఆందోళనలు చేయడంతో పాటు చెత్త వాహనాలను అడ్డుకున్నారు. దీంతో ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు బయోమైనింగ్ ద్వారా పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ఫలితంగా కొంత స్థలం ఖాళీ అవగా.. చుట్టుపక్కల ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా, భవిష్యత్‌లో ఏ రోజు చెత్త ఆరోజు తొలగించేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీంతో దుర్వాసన నుంచి విముక్తి లభించనుంది.

10 వేల మొక్కలు నాటేలా..

డంపింగ్‌యార్డులో 10 ఎకరాల స్థలాన్ని కేఎంసీ అధికారులు శుభ్రం చేయించి స్వాధీనం చేసుకున్నారు. ఈ స్థలంలో 10 వేల పండ్ల, ఇతర రకాల మొక్కలను నాటేలా ప్రణాళికలు చేశారు. మొక్కలను అవసరమైన నీటి వనరులను ఏర్పాటు చేసేందుకు బోర్లను ఏర్పాటు చేసి మోటార్లు బిగించారు. ఇప్పటి వరకు 8 వేల మొక్కలు నాటినట్లు అధికారులు పేర్కొంటున్నారు. మరో 2 వేల మొక్కలను దశలవారీగా నాటనున్నారు. ఉద్యానవనాన్ని తలపించేలా ఈ మొక్కలను పెంచుతున్నారు. మొక్కల ఆలన పాలన చూసేందుకు ప్రత్యేకంగా గార్డెన్ వర్కర్లను నియమించారు.

కాలుష్యాన్ని నివారించేందుకు..



డంపింగ్‌యార్డు నుంచి వెలువడే కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు ఆహ్లాద వాతావరణాన్ని పంచేలా మొక్కలు పెంచుతున్నాం. ఇందులోని వ్యర్థాలను బయోమైనింగ్ ద్వారా తొలగిస్తుండగా.. ఇక నుంచి ఏరోజు వచ్చే చెత్తను ఆ రోజే శుభ్రం చేసే ప్రాజెక్టును తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు సంబంధించి రూ.25 కోట్ల డీపీఆర్‌ను ఓ ఏజెన్సీ సమర్పించింది. స్థానిక ప్రజలకు డంపింగ్‌యార్డుతో కలిగే సమస్యలను పరిష్కరిస్తాం.

– అభిషేక్ అగస్త్య, కేఎంసీ కమిషనర్

సాగుకు యోగ్యం కాని భూములపై సర్వే



సింగారెడ్డిపాలెంలో గుట్టలను పరిశీలిస్తున్న ఏడీఏ

నేలకొండపల్లి: మండలంలోని సింగారెడ్డిపాలెం, కట్టుకాచారంలో శనివారం కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకులు బి.సరిత పర్యటించి సాగుకు అనుకూలంగా లేని గుట్టలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించేందుకు రెవెన్యూ, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యాన క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టినట్లు తెలిపారు. సాగుకు అనుకూలంగా ఉన్న భూములకు మాత్రమే రైతు భరోసా వర్తిస్తున్నందున గ్రామస్థాయిలో క్లస్టర్ వారీగా సర్వే చేస్తున్నామన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే గ్రామసభలో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి ఎం.రాధ, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బి.రవి, ఏఈఓలు అరవింద్, శిరీష, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న కార్మికులు

ఖమ్మం మామిళ్లగూడెం: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో(పేరాల కట్టయ్య భవనంలో) నేడు (ఆదివారం) జరగనున్న తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రెండో రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జి.రామయ్య పిలుపునిచ్చారు. శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న ధరలతో మున్సిపాలిటీ కార్మికులకు బతకడమే కష్టంగా ఉందని, మున్సిపాలిటీలలో బడ్జెట్ లేదని నెపంతో సకాలంలో వేతనాలు కూడా ఇవ్వడం లేదన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, కాంట్రాక్ట్ కార్మికులకు కూడా కార్మిక చట్టాలను వర్తింపజేయాలని కోరారు. అనంతరం బ్రోచర్లు ఆవిష్కరించారు. టీయూసీఐ ఖమ్మం ఏరియా కార్యదర్శి కొయ్యల శ్రీనివాస్, ఏరియా అధ్యక్షుడు ములకలపల్లి లక్ష్మీనారాయణ, మున్సిపల్ వర్కర్ నాయకులు దున్న గురవయ్య, కిన్నెర నారాయణ, కాంతయ్య, ధర్మయ్య, పార్థు, వీరబాబు, సావిత్రి, సరస్వతి, మోహన్, మల్సూర్, యుగంధర్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

ఖమ్మంఅర్బన్: కేరళలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ కొట్టాయంలో జరిగిన సౌత్ జోన్ యూనివర్సిటీ బాస్కెట్‌బాల్ మహిళ విభాగంలో నగరంలోని బొమ్మ కాలేజీ విద్యార్థిని ఎస్.తులసి జేఎన్‌టీయూ యూనివర్సిటీ నుంచి పాల్గొని ప్రతిభ చూపిందని కాలేజీ చైర్మన్ బొమ్మ రాజేశ్వరరావు తెలిపారు. ఈమేరకు శనివారం విద్యార్థిని కాలేజీలో అభినందించారు. వైస్ చైర్మన్ బొమ్మ సత్యప్రసాద్, కార్యదర్శి ఉదారు శ్రీధర్, ప్రిన్సిపాల్ జి.భిక్షం, విజయభాస్కర్, రంజిత్, కిరణ్‌జ్యోతి ఉన్నారు.

'శ్రీచైతన్య ఒలంపియాడ్' విద్యార్థులు..

ఖమ్మంసహకారనగర్: ఇటీవల జాతీయస్థాయిలో ఐఏపీటీ, హోమిబాబా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్ సంయుక్తంగా నిర్వహించిన జూనియర్ సైన్స్ ఒలంపియాడ్ పరీక్షలో స్థానిక మమత ఆస్పత్రి రోడ్డులోని శ్రీచైతన్య ఒలంపియాడ్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారని విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య తెలిపారు. ఈమేరకు శనివారం పరీక్షలో ఎంపికైన విద్యార్థులు కౌశిక్‌రెడ్డి, సాయి మహేష్, జోషిత్, పార్థులను యాజమాన్యం అభినందించింది. ప్రిన్సిపాల్ శర్మ, ఐపీఎల్ ఇన్‌చార్జ్ రాజశేఖర్‌రెడ్డి, డీన్ కేవీఆర్, డీజీఎం చేతన్, కోఆర్డినేటర్ కృష్ణారావు, వైస్ ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జరిమానా

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురంలో అనుమతి లేకుండా గ్రామానికి చెందిన నరసింహారావు గానుగ చెట్టును నరికాడు. దీంతో గ్రామస్తుల ఫిర్యాదు మేరకు అటవీ శాఖ సెక్షన్ అధికారి డానియేల్ రూ.3,300 జరిమానా విధించారు.

అండగా ఉంటాం..



వెంకటేశ్వర్లును పరామర్శిస్తున్న మున్నూరు కాపు సంఘం నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించుకుని ప్రాణాపాయ స్థితిలో ఉన్న కొణిజర్ల మండలం తనికెళ్ల గ్రామానికి చెందిన పెంటికల వెంకటేశ్వర్లుతో పాటు ఆయన కుటుంబానికి అండగా ఉంటామని మున్నూరు కాపు సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా కమిటీ నేతలు ప్రకటించారు. ఈమేరకు శనివారం మున్నూరు కాపు సంఘం బాధ్యులు ఆకుల గాంధీ, పార నాగేశ్వరరావు, తోట రామారావు, మదారి పూర్ణ, ముత్యం ఉప్పలరావులతో పాటు వివిధ పార్టీల నాయకులు హన్మంతరావు, శేషగిరిరావు, వెంకటేశ్వరరావు, ఆదర్శ ఉపాధ్యాయుడు లేడిబోయిన గోపాల్‌రావు తదితరులు పరామర్శించారు. చికిత్సకు అత్యధిక ఖర్చు కావడంతో ఆరోగ్య ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ సుమంత్ తమ డాక్టర్ల బృందంతో వైద్య సాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ సంబరాలు

ఖమ్మంరూరల్: ఏదులాపురం కొత్త మున్సిపాలిటీగా ప్రకటిస్తూ ప్రభుత్వం రాజపత్రాన్ని విడుదల చేయడం పట్ల హర్షిస్తూ శనివారం వరంగల్ క్రాస్‌రోడ్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి బాణాసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకురాలు బేబీ స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్‌నాయక్, ఎ.అశోక్‌నాయక్‌లు హర్షం వ్యక్తంచేశారు.

తహసీల్ ఎదుట నిరసన



నిరసన తెలుపుతున్న రామనర్సయ్య దంపతులు

కామేపల్లి: దొంగ వీలునామా సృష్టించి తమ భూమిని కాజేయాలని చూస్తున్నారని, తమకు న్యాయం చేయాలని లేకుంటే తాము పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామంటూ మండలంలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన దీవెల్ల రామనర్సయ్య, భార్య కనమ్మ దంపతులిద్దరూ కామేపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం పురుగుల మందు డబ్బాతో నిరసన వ్యక్తం చేశారు. కామేపల్లి రెవెన్యూలో తన 10 ఎకరాల భూమిని కొంతమంది నకిలీ వీలునామా సృష్టించి తమ భూమిని కాజేయాలని ప్రయత్నిస్తున్నారని, రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై తహసీల్దార్ సుధాకర్‌ని వివరణ అడగగా రామనర్సయ్య వినతిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

దేవాలయం అభివృద్ధికి కృషి చేయాలి



దేవాలయం కమిటీ చైర్మన్‌ను సన్మానిస్తున్న దయాకర్‌రెడ్డి

నేలకొండపల్లి: దేవాలయం అభివృద్ధికి నూతన పాలకవర్గం కృషి చేయాలని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో రెడ్డిమళ్ల బాబురెడ్డి ఆధ్వర్యాన నూతనంగా ఏర్పాటు చేసిన ఐఎన్‌టీయూసీ జెండాను శనివారం ఆవిష్కరించారు. అనంతరం శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం పాలకవర్గం చైర్మన్‌గా కనమర్లపూడి రమేష్, సభ్యులుగా అనంతు సత్యనారాయణ, కొండబాల రాంబాబు, కైలాసపు కోటేశ్వరీ, సీతారాములు, పి.సత్యంల ప్రమాణా స్వీకార కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈఓ శ్రీకాంత్, మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, మాజీ సర్పంచ్‌లు వంగవీటి నాగేశ్వరరావు, ఎం.వెంకన్న, రాయపూడి నవీన్, నాయకులు భద్రయ్య, బొడ్డు బొందయ్య, రెడ్డిమళ్ల బాబురెడ్డి, జెర్రిపోతుల అంజిని, బచ్చలకూరి నాగరాజు, బోయిన వేణు, కడియాల నరేష్, గుండా బ్రహ్మం, లక్కం ఏడుకొండలు, మామిడి సుభద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఆచరణకు నోచుకోని దరఖాస్తులు



సమావేశంలో మాట్లాడుతున్న విక్రమ్

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజాపాలనలో తీసుకున్న దరఖాస్తులు ఆచరణకు నోచుకోవడం లేదని సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ ఆరోపించారు. శనివారం ఖమ్మంలోని సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో స్వీకరించిన దరఖాస్తుల్లో రేషన్‌కార్డుల కోసం వేల సంఖ్యలో వేల సంఖ్యలో దరఖాస్తు వచ్చాయని, వాటన్నింటిని సర్వే చేసి రేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. అలాగే గత ప్రభుత్వం సుమారు 5వేల మంది పేదలకు ఇంటి పట్టాలు ఇచ్చిందని, వారికి ఇంత వరకు ఇంటి స్థలం చూపించలేదన్నారు. అలాగే 58 వేల మంది ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోగా వారికి రూ.5లక్షలను విడతల వారీగా ఒకేసారి విడుదల చేయాలని, రైతులకు రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సర్వేలలో రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. రేషన్ కార్డుల సమస్యలపై ఈ నెల 22న ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎంఏ జబ్బార్, ఎస్‌కె.మీరా సాహెబ్, నవీన్‌రెడ్డి, దొంగల తిరుపతిరావు, వన్ టౌన్ కార్యదర్శి ఎస్‌కె.నాగుల్ మీరా, టూటౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, త్రీటౌన్ కార్యదర్శి భూక్యా శ్రీను, అర్బన్ మండల కార్యదర్శి బత్తుల ఉపేందర్, నాయకులు వజినేపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులు ఇవ్వాలని వినతి

తిరుమలాయపాలెం: అర్హులైన నిరుపేదలకు రేషన్ కార్డులు ఇవ్వాలని కోరుతూ అఖిలపక్షం ఆధ్వర్యంలో శనివారం మండల తహసీల్దార్ పి.వి రామకృష్ణకు వినతి పత్రం అందజేశారు. అనేక సంవత్సరాలుగా రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో వివాహాలు అయి వేరుగా ఉంటున్న కుటుంబాలకు రేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం అధికారులు చేస్తున్న సర్వేలో కొంతమంది పేర్లు మాత్రమే వచ్చాయని విన్నవించారు. గ్రామ సభలలో రేషన్ కార్డులకు ధరఖాస్తులు తీసుకుని ఎంపిక చెయ్యాలని కోరారు. నాయకులు గంట కృష్ణ, అశోక్, కొమ్ము శ్రీను, ఎర్రా శ్రీనివాసరావు, రమేష్, మట్టే నాగేశ్వరరావు, కొమ్ము పూలే,, మల్సూర్,సురేష్ మహారాజ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులు.. నిరంతర ప్రక్రియ

ఖమ్మంరూరల్: ఇంటింటి సర్వేలో (కులగణన) రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకొని పేరు రాకపోయినా వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తహసీల్దార్ పి. రాంప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్ కార్డుల సర్వే జరుగుతున్న సమయంలో కొంతమంది తమ పేర్లు రాలేదని ఆందోళన చెందుతున్నారని, అలా ఎవరూ కంగారు పడవద్దని తెలిపారు. మరోసారి అర్హులైన వారి నుండి మరోసారి దరఖాస్తులు తీసుకుని రేషన్ కార్డు మంజూరు చేయడం జరుగుతుందని, కాబట్టి ప్రజలు గమనించాలని పేర్కొన్నారు.

నూతన ఉపాధ్యాయుల వేతనాలు చెల్లించాలి



వినతి పత్రం ఇస్తున్న టీపీటీఎఫ్ బాధ్యులు

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం కాంప్లెక్స్ పరిధిలోని వివిధ పాఠశాలల్లో డీఎస్సీ 2024 ద్వారా విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయుల జీతాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.వెంకటేశ్వరరావు, డి.వెంకట్రాములు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం టీపీటీఎఫ్ మండల బాధ్యులు తిరుమలాయపాలెం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారికి వినతిపత్రం అందజేశారు. గతేడాది ఉద్యోగం సాధించి మండలంలోని అన్ని కాంప్లెక్స్‌లలో పనిచేసే నూతన ఉపాధ్యాయులకు జీతాలు అందాయని, ఒక్క తిరుమలాయపాలెం కాంప్లెక్స్‌లో మాత్రమే కనీసం ఒక్క నెల జీతం కూడా పొందలేదన్నారు. ఈ విషయంపై జిల్లా అధికారులతో మాట్లాడి ఉపాధ్యాయుల వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏవీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా 'రైతు భరోసా'



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

రఘునాథపాలెం: మండల పరిధిలోని 37 గ్రామపంచాయతీలో రైతు భరోసా పథకానికి సంబంధించిన అర్హుల జాబితాలో నిరుపేద వ్యవసాయ కూలీలకు స్థానం లేకుండాపోయిందని సీపీఎం రఘునాథపాలెం మండల కార్యదర్శి ఎస్.నవీన్‌రెడ్డి విమర్శించారు. ఈమేరకు శనివారం వ్యవసాయ కూలీలతో కలిసి సీపీఎం ఆధ్వర్యాన ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పని దినాలను సాకుగా చూపెడుతూ అర్హుల జాబితాలో కూలీలకు చోటు లేకుండా చేశామని విమర్శించారు. జింకలతండ గ్రామంలో సెంటు భూమి కూడా లేని నిరుపేదలను ఉపాధి పనులు చేసినప్పటికీ పే స్లిప్పులు లేకపోవడంతో ఈ పథకంలో చేర్చలేదన్నారు. కానీ వారు పనులు చేశారని, గతేడాది పని దినాలకు సంబంధించినవి ప్రకటించమని అడిగితే మా వద్ద లేదని అధికారులు బుకాయిస్తున్నారని విమర్శించారు. దీనిపై వ్యవసాయ మంత్రి దృష్టి సారించి సమస్య పరిష్కారమయ్యేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూచిపూడి నరేష్, షేక్ రహీం, మైబు, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీలో మాస్ వర్క్

- వంద మంది కార్మికులతో పారిశుద్ధ్య పనులు
- డ్రెయినేజీల్లో పేరుకుపోయిన సిల్ట్, ఫుట్‌పాత్‌లపై ఉన్న తోపుడు బండ్లు, బోర్డుల తొలగింపు



తోపుడు బండ్లను ట్రాక్టర్లలోకి ఎక్కిస్తున్న డీఆర్‌ఎఫ్ సిబ్బంది

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థలో పారిశుద్ధ్యం మెరుగు పర్చడంతో పాటు రోడ్డు వెంట ఆక్రమణలను తొలగించేందుకు అధికారులు చర్యలకు ఉపక్రమించారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాలతో శనివారం నగరంలో జెడ్పీ సెంటర్ నుంచి ఇందిరానగర్ వరకు, ఇల్లెందు క్రాస్ రోడ్డు నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు శానిటేషన్ మాస్‌వర్క్ నిర్వహించారు. వందమంది కార్మికులతో డ్రెయినేజీల్లో వ్యర్థాలను తొలగించడం, రోడ్లు ఊడిపించడం, డివైడర్లలో మొక్కలు నాటించడం, రోడ్ల వెంట అక్రమంగా ఏర్పాటు చేసిన వాటిని తొలగించే పనులను చేయించారు. ఈ పనులను కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లాలు ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. టేకులపల్లి డబుల్ బెడ్రూం వైఎస్సార్‌నగర్, లకారం ట్యాంక్‌బండ్ ప్రాంతాల్లో సందర్శించిన కమిషనర్ కొత్తగా పార్కులను ఏర్పాటు చేసేందుకు స్థలాలను పరిశీలించి ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు.

ఆక్రమణలు తొలగింపు..

మాస్ వర్క్‌లో భాగంగా రోడ్ల వెంట ఫుట్ పాత్‌లపై, రోడ్లపై అక్రమంగా ఏర్పాటు చేసిన తోపుడు బండ్లను డీఆర్‌ఎఫ్ సిబ్బంది తొలగించారు. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ఐటీ హబ్ వరకు స్టేడియం బయట రోడ్డు వెంట ఉన్న తోపుడు బండ్లు, వీధి వ్యాపారుల దుకాణాలను తొలగించారు. ఈ తొలగింపులు జెడ్పీ సెంటర్ నుంచి ఇందిరానగర్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో డీఈఈ శ్రీనివాస్, శానిటేషన్ సూపర్‌వైజర్ సాంబయ్య, ఉద్యానఅధికారి బెల్లం రాధిక, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు వర్ధంతి వేడుకలను శనివారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యాన నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహాలు, చిత్రపటాలకు ఆయన అభిమానులు, పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈమేరకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి ఆయన అందించిన సేవలను కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంమయూరిసెంటర్: ఎన్టీఆర్ సర్కిల్‌లో నివాళులర్పిస్తున్న తాత మధుసూదన్, సండ్ర వెంకటవీరయ్య, కొండబాల తదితరులు